# సిలికానాంధ్రకు ప్రశంసలజల్లు

## విశ్వవ్యాప్తంగా  నూతనోత్తేజం నింపిన కూచిపూడి సమ్మేళనం

సిలికానాంధ్ర ఆధ్వర్యంలో అమెరికాలో  మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం నిజంగా కూచిపూడి నాట్యరంగంలో నూతనోత్తేజాన్ని నింపింది. ఈ నాట్యం మహామహులైన గురువుల వల్ల, శిష్యప్రశిష్య పరంపరాగమైన నర్తకీనర్తకుల వల్ల ఖండాంతరాల్లో ఒక వెలుగు వెలిగినా, పరిస్థితి ఎవరికి వారుగా ఉందన్నది సత్యం.  అక్కడక్కడా ఒకరిద్దరు శక్తి మేరకు కూచిపూడి నాట్యోత్సవాలు నిర్వహిస్తున్నా ప్రపంచ స్థాయిలో కూచిపూడికి ఒక అత్యున్నత వేదికను కల్పించిన ఘనత మాత్రం సిలికానాంధ్రకు దక్కుతుంది. విశేషించి గురువుల మధ్య సామరస్యపూర్వక సంబంధాలు లేకపోవడం వల్ల ఏకీకృతమైన ప్రయత్నాలు సాధ్యం కాలేదు. ఇటువంటి వాతావరణంలో,  సిలికానాంధ్ర అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ప్రపంచంలోని కూచిపూడి ప్రముఖులను ముఖ్యంగా మనదేశంలో భిన్న ధృవాలుగా ఉన్న గురువులను స్వయంగా కలుసుకుని తన ఆలోచనల్ని వారికి వివరించారు. ఇంకా చెప్పాలంటే,  గురువులకు దాసోహం పలికి కూచిపూడికి తాము తలపెట్టిన కళ్యాణానికి మీరంతా పురోహితులై తరలి రావాలని ప్రార్థించారు. ఆనంద్ సంకల్పానికి అందరూ ముగ్ధులయ్యారు. ఈ నేపధ్యంతో సిలికానాంధ్ర చేసిన ఏర్పాట్లు, సిలికానాంధ్ర కుటుంబంలో సభ్యులుగా వున్న ఒక వంద మంది కొన్ని నెలల పాటు రేయింబవళ్ళు చేసిన శ్రమ ఫలించి అనుకున్న విధంగా అంతర్జాతీయ సమ్మేళనం జరిగింది.

కూచిపూడి నాట్యరంగంలో ప్రముఖులుగా పేర్కొనదగినవారు , దేశవిదేశాల్లో అనురక్తితో నాట్యాన్ని అభ్యసిస్తున్న వారు, పోషిస్తున్న, ప్రోత్సహిస్తున్న వారు, ఒక వేదికపైకి వచ్చారు. మూడు రోజులు ఇక్కడే ఉండి విలక్షణ ఏర్పాట్లు చేసిన కార్యక్రమాలను పరిశీలించారు. కూచిపూడిలోని గురువులందరినీ వేదికపై కూర్చోబెట్టి వారి సేవలను ప్రస్తావించి వారి వారి శిష్యబృందంతోనే ఘనంగా సత్కరింప చేయడం, ఆ వేడుకను వందలాది మంది తిలకించి పులకరించి పోవడం అపురూపమైన సన్నివేశంగా అనిపించింది. ఆ వేదిక అపూర్వం. గురు పూజోత్సవంలో లెజెండ్ అనదగిన వెంపటి చినసత్యం తొలి గౌరవం అందుకోగా, ఆయనకు అటు ఇటు డా. యామినీ కృష్ణమూర్తి,  డా. రాజా రెడ్డి,  రాధారెడ్డి,  డా. ఉమా రామారావు, డా. శోభానాయుడు, కె.వి. సత్యన్నారాయణ, వనశ్రీ రావు, డా. రత్న పాప, వేదాంతం రాధేశ్యామ్ , వేదాంతం రామలింగ శాస్త్రి, పసుమర్తి రామలింగ శాస్త్రి, మహంకాళి సూర్యనారాయణ శర్మ, పసుమర్తి వెంకటేశ్వరరావు, మద్దాలి ఉషా గాయత్రి, భాగవతుల సేతురాం, డా. అలేఖ్య, డా. జొన్నలగడ్డ అనూరాధ, అమెరికా నుంచి వచ్చిన జ్యోతి

చింతలపూడి, శ్రీ లక్ష్మి పుచ్చా, జ్యోతి లక్కరాజు, హిమబిందు చల్లా, వైదేహి, శ్యామల, మాధురీ కిషోర్ , సునీత పెండేకంటి, కాంతం చల్లపల్లి.... ఇలా సుమారు వంద మంది గురువులను ఒక్క వేదిక పై కూర్చోబెట్టి సత్కారం చేయ్యడం ఇంతకు మునుపెన్నడూ జరగలేదు. ఇలాంటి సత్కారం వల్ల ఇంతకాలం తాము చేసిన సేవలను గుర్తించిన అనుభూతి ఆ గురువులకు కలిగింది. ఇక ముందు తాము చేయగలిగింది ఎంతో వుందనే బాధ్యతను కూడా ఈ సత్కారం గుర్తు చేసింది. ఇది ఒక విధంగా కూచిపూడి నాట్య కళారంగంలో గొప్ప కదలికగా చెప్పుకోవచ్చు. ఆ వందమందినీ కలిపి తీసిన చాయా చిత్రం, వీడియో కాపీ రేపటి చరిత్రకు కానుకే అవుతుంది.
జూన్ 21వ తేదీ ఉదయం అమెరికాలో కాలిఫోర్నియాలోని కూపర్టీనో నగర వీధులు తెలుగు సంస్కృతికి నిలయాలయ్యాయి. జాలిమన్ పార్క్ నుండి డి ఆంజా కాలేజీ వరకు కనీవినీ ఎరుగని విధంగా కూచిపూడి శోభాయాత్ర జరిగింది. స్వర్ణకాంతులీనే 10 అడుగుల ఎత్తయిన రథంపైన కూచిపూడి నుంచి తెచ్చిన బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులు, సిద్ధేంద్రయోగి విగ్రహాన్ని ఉంచి కూచిపూడి శోభాయాత్ర నిర్వహించారు. మోటారు సైకిళ్ళపై స్థానిక పోలీసులు ఎస్కార్టుగా రాగా కూపర్టీనో మేయర్ , డిప్యూటీ మేయర్ తో సహా పలువురు కౌన్సిల్ మెంబర్లు, ఇతర అధికార గణం , కూచిపూడి నాట్య గురువులు, సిలికానాంధ్ర సభ్యులు, రాష్ట్ర మంత్రి బుద్ధ ప్రసాద్ ఈ శోభా యాత్రలో సాగారు.

లేపాక్షి బసవన్న శిల్పాకృతిని ప్రతిష్టించిన, నర్తకీమణుల నాట్యాల యుక్తంగా సాగిన శకటం వెనుక రథం, ఆ వెనుక 20 కన్వర్టబుల్ కార్లు శోభాయాత్రలో పాల్గొన్నాయి. డి ఆంజా కాలేజీ పార్కింగ్ లాట్ లో నిర్మించిన ప్రత్యేక వేదికపై 350 మంది కూచిపూడి నర్తకనర్తకీమణులు వెంపటి రవిశంకర్ నేతృత్వంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధికారి పర్యవేక్షణలో చేసిన అఠాణా జతిస్వరం భారీ నాట్య ప్రదర్శన ఒక అపూర్వ సంఘటన. కోలాహలంగా ఈ ప్రదర్శన జరుగుతున్నప్పుడు అక్కడున్న వారంతా ఒక అద్భుత సన్నివేశానికి సాక్షులవుతున్న అనుభూతికి లోనయ్యారు. నాట్యాంశాన్ని ఉత్కంఠతో వీక్షించారు.కూచిపూడి అఠాణా జతిస్వరం ప్రదర్శన ప్రపంచ రికార్డుగా నమోదయినట్టు గిన్నిస్ బుక్ వారి నుంచి అధికారిక ప్రకటన వెల్లడి కావడంతో అక్కడున్న మూడువేల మంది కూచిపూడి అభిమానుల్లో సంభ్రమాశ్చర్యాలు వెల్లువెత్తాయి. ఫ్లింట్ సెంటర్లోని ప్రారంభోత్సవ వేదికపై కేంద్రమంత్రి పురంధరేశ్వరి, రాష్ట్ర మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ , సాంస్కృతిక శాఖ సంచాలకులు రాళ్ళబండి కవితా ప్రసాద్ , తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ఆవుల మంజులత, సిలికానాంధ్ర సారధులు కూచిభొట్ల ఆనంద్ , విస్సంరాజు ఫణి, కొండపర్తి దిలీప్ , అతిరధ మహారధులైన కూచిపూడి గురువులు ఆనందంతో గిన్నిస్ బుక్ వాళ్ళు జారీ చేసిన ధ్రువపత్రాన్ని పైకెత్తగా మూడు వేల మంది ప్రేక్షకులు కరతాళధ్వనులు చేశారు.

ఆ వెంటనే ఏడు శతాబ్దాల చరిత్రగల కూచిపూడి నాట్య అవిర్భవ వికాసాలను ప్రతిబింబించే "కూచిపూడి వైజయంతిక" నృత్యరూపక ప్రదర్శన జరిగింది. దేశవిదేశాల నుంచి వచ్చిన సుమారు అరవై మంది నర్తకనర్తకీమణులు కూచిపూడి కళామతల్లికి తామంతా నాట్య నీరాజనం సమర్పిస్తున్నామన్న దివ్యానుభూతితో నర్తించి యజ్ఞ సదృశ్యమైన నాట్యాంశాన్ని ప్రదర్శించారు.

శనివారం సాయంత్రం, కొత్తపల్లి పద్మ రూపొందించిన "తరిగొండ వెంగమాంబ", డా . రాజారెడ్డి, రాధారెడ్డి, కౌసల్యా రెడ్డి చేసిన "నాట్యప్రదీపం", డా. వెంపటి చినసత్యం 75వ జన్మదిన కానుకగా కమలారెడ్డి( అమెరికా) రూపొందించిన "గురువందనం" నృత్య రూపకాలు ప్రేక్షకులను రసానందంలో ముంచెత్తాయి. చివరి ప్రదర్శనగా కూచిపూడి సంప్రదాయ కళాకారులు వేదాంతం రాధేశ్యాం బృందం ప్రదర్శించిన ప్రహ్లాద యక్షగానం ప్రేక్షకులకు అరుదైన కానుకగా లభించింది. హాలుహాలంతా లేచి, యక్షగాన వైభవానికి ప్రశంసాపూర్వకంగా హర్షధ్వానాలు చేశారు. కూచిపూడి కళను వారసత్వంగా స్వీకరించి, ఆ కళను కొనసాగుంచాలన్న సంకల్పం ఉన్న వారందరికీ ఈ వేడుకలో బ్రహ్మరథం పట్టారు. ఆఖరి రోజు డా. వేదాంతం రామలింగ శాస్త్రి నేతృత్వంలో ప్రదర్శితమైన "నర్తనశాల" నృత్య నాటకం కూడా ప్రేక్షకులను రసానందంలో ఓలలాడించింది.

పద్మ శ్రీ డా. శోభానాయుడు ప్రదర్శించిన "కళ్యాణ శ్రీనివాసం" కూపర్టీనోలో కలియుగ వైకుంఠాన్ని ప్రతిష్టించింది. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణవైభవాన్ని కళ్ళకు కట్టించింది. వెరసి కలియుగ వైకుంఠాన్ని సాక్షాత్కరింపజేసింది. చివర్న కె.వి. సత్యన్నారాయణ బృందం వారి "ఆముక్తమాల్యద" గోదాదేవి కళ్యాణ వేడుక చూసిన వారికి తెలుగు వారి పెళ్ళి ముచ్చటను మనోహరంగా ప్రతిబింబింపజేసింది. డా. కె. ఉమారామారావు "అన్నమయ్య అల్లరి కృష్ణుడు", పద్మ శ్రీ జయరామారావు, వనశ్రీ రామారావుల "ఓంకారం" అద్భుతంగా సాగాయి.

మళ్ళీ 2010లో హైదరాబాద్ లో రెండవ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనంలో మళ్ళీ కలుద్దామని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ముగింపు వాక్యం పలికారు.